
# దేవుడా... వీళ్ళ బుద్ధుల్ని మార్చు

ముచ్చర్ల రజనీ శకుంతల



ప దమూడేళ్ళ బబ్లూ, పదమూడ్రోజుల క్రితం సిటీకి దగ్గర్లో వున్న అడవుల్లోకి వెళ్ళి దేముడి గురించి తపస్సు చేస్తున్నాడు. బబ్లూ గురించి వాళ్ళ తల్లిదండ్రులు మొత్తం వెతికారు. బంధువులు పోలీసు కంప్లయింట్ యివ్వమన్నారు. బబ్లూ తండ్రి ఓ నవ్వు నవ్వి వూర్కున్నాడు.

''వాడు... నా కొడుకు... వాడ్ని కిడ్నాప్ చేసే ధైర్యం ఎవరికుంటుంది? ఉంటే, గింటే వాడైపోతాడు'' మనసులో అనుకున్నాడు.

''స్కూల్లో మిస్‌లు, మగ టీచర్లూ, ప్రిన్సిపాలూ కంగారుపడిపోయేరు. బబ్లూ తల్లి తన మొగుడిలానే ఓ నవ్వు నవ్వి వూర్కుంది.

''మాయదారి చదువులు, మహమ్మారి పుస్తకాల బరువులు, వెధవ పనిష్మెంట్లు... అంతా మీవల్లే...'' అని మనసులో తిట్టుకుంది. కానీ, కొడుకు గురించి కించిత్ బాధ పడ్లేదు. ఎక్కడికి

వెళ్ళినా తన కొడుకు క్షేమంగా తిరిగొస్తాడన్న నమ్మకం ఆ తల్లిది.

* * *

ఆ వేళ్టికి బబ్లూ తపస్సు మొదలుపెట్టి పదమూడ్రోజులు పూర్తి కావస్తూంది. అదే సినిమాలైతే 'నేడే విజయవంతమైన రెండవ రోజు' అనో, 'విజయవంతమైన నాలుగో షో' .. అనో వేయించుకునే వాళ్లు సినిమావాళ్లు. హీరోలు సినిమాలను ఆడకపోయినా, ఆడించుకునేవాళ్లు.

కానీ, బబ్లూ తపస్సుకు పబ్లిసిటీ అక్కర్లేదాయె... ఇంకా అంత టెక్నాలజీ డెవలప్ అవ్వలేదు. లేకపోతే ఈ తపస్సును స్పాన్సర్ చేస్తున్న వాళ్లు... సో... అండ్ సో కంపెనీ... అని తపస్సు చేసే ప్లేస్‌లో బోర్డులు ప్రత్యక్షమయ్యేవి.

సరే, బబ్లూ తపస్సు దేముడి దగ్గరి వరకూ వెళ్ళింది.

''ఈ తపస్సు భంగం చేయవలసిందే...'' ఇంద్రుడు యాజిటేజ్‌గా తీర్మానించాడు. వరుణదేవుడ్ని పిలిచాడు.

''సారీ.. ఐ కాంట్ హెల్ప్... మామూలుగా సీజన్‌లోనే వర్షాలు కురిపించలేకపోతున్నాను...'' అని తన నిస్సహాయతను తెలిపాడు.

అగ్నిదేవుడ్ని పిలిచాడు.

''కట్నంకోసం కిరోసిన్ పోసి, బోల్డుమంది అత్తామామలు నన్ను ఉపయోగించుకుంటున్నారు. నేనిప్పుడు మండినా ఏమిటి యూజ్...? పైగా అడవిలోని చెట్లన్నీ కాలిపోతాయి. అసలే చెట్లని నరికేస్తున్నారు జనం... వనదేవుడు ఆమధ్యే ఫీలయ్యాడు'' అగ్నిదేవుడు చెప్పాడు.

కింకర్తవ్యమ్... అని దేవేంద్రుడు థింక్ చేస్తోన్న సమయంలోనే, దేముడు బబ్లూ ముందు ప్రత్యక్షమయ్యాడు.

* * *

''బబ్లూ... ఏమి నీ కోరిక?'' అడిగాడు దేముడు.

''నా ఒరిజినల్ నేమ్ సాకేత్... నువ్వు కూడా పెట్ నేమ్‌తోనే పిలుస్తున్నావు. నువ్వు ఒరిజినల్ దేముడివేనా?'' అడిగాడు బబ్లూ.

''నోడౌట్... కావాలంటే నేను దేముడ్నో, కాదో టెస్ట్ చేసుకో...'' నవ్వుతూ అన్నాడు దేముడు.

ఎందుకో దేముడ్ని టెస్ట్ చేయాలని అనిపించలేదు బబ్లూకి... అదే విషయం దేముడికి చెప్పాడు.

''రాముడు మంచి బాలుడిలా నువ్వూ మంచి బాలుడివే...'' అన్నాడు దేముడు.

''థాంక్యూ గాడ్...'' బబ్లూ కృతజ్ఞతలు చెప్పాడు.

''ఇంతకీ నీ కోరిక ఏమిటి?'' తెలిసి కూడా అడిగాడు దేముడు.

''మీకు తెలియదా?'' బబ్లూ గడుసుగా అడిగాడు.

''భక్తులు కోరికలకై తపస్సు చేయగానే, ఆ తపస్సుకు మెచ్చి 'ఏమి నీ కోరిక...' అని అడగడం ఆనవాయితీ... బాలుడా... ఏమి నీ కోరిక?'' దేముడు అడిగాడు.

''నా కోరిక కాదు.. నాలాంటి లక్షలమంది స్కూలు పిల్లల కోరిక...'' బబ్లూ చెప్పాడు.

> ''దేముడా.. మీరు ఎన్నో అవతారాలు ఎత్తారు... ప్రతీ అవతారంలో ఓ రాక్షసుడ్ని హతమార్చారు. ఈ యుగంలో మాత్రం ఏమీ చేయడం లేదు. విద్యావిధానం అనే రాక్షసి మమ్మల్ని వేధిస్తున్నది. పుస్తకాల బరువు అనే పిశాచి మా వీపుల మీద కూచుంటున్నది... విద్య నేర్పే గురువులు.. మా పాలిట యమకింకర్లు అయ్యారు... ఒక్కసారి అంతా మీ దివ్య దృష్టితో వీక్షించండి''

''ఏమిటది?'' అడిగాడు దేముడు.

''మాకులా రోజూ దినపత్రికలు చదివే అలవాటు మీ దేముళ్ళకు వుండదు... ఎట్‌లీస్ట్ టీవీలో వార్తలు కూడా చూడరు..'' బబ్లూ దెప్పిపొడిచాడు.

''మాకు దివ్యదృష్టి వుందిలే'' దేముడు చెప్పాడు.

''ఆ దివ్య దృష్టితో ఒక్కసారి పరికించండి ప్రభూ...'' బబ్లూ చెప్పాడు.

''విషయం కొద్దిగా వివరించు... మిగతాది దివ్యదృష్టితో వీక్షిస్తాం...'' దేముడు చెప్పాక బబ్లూ మొదలుపెట్టాడు.

* * *

''దేముడా.. మీరు ఎన్నో అవతారాలు ఎత్తారు... ప్రతీ అవతారంలో ఓ రాక్షసుడ్ని హతమార్చారు. ఈ యుగంలో మాత్రం ఏమీ చేయడం లేదు. విద్యావిధానం అనే రాక్షసి మమ్మల్ని వేధిస్తున్నది. పుస్తకాల బరువు అనే పిశాచి మా వీపుల మీద కూచుంటున్నది... విద్య నేర్పే గురువులు.. మా పాలిట యమకింకర్లు అయ్యారు... ఒక్కసారి అంతా మీ దివ్యదృష్టితో వీక్షించండి'' అన్నాడు.

దేముడు దివ్య చక్షువులు తెరిచాడు.

* * *

ఓపక్క పెద్దపెద్ద బస్తాలు భుజంమీద వేసుకొని, బ్రతుకుతెరువుకోసం కష్టపడుతూ కొందరు కనిపించారు. క్రమక్రమంగా ఆ దృశ్యం డిజాల్వ్ అవుతూ వచ్చింది. వాళ్ల స్థానంలో చిన్నారులు... చిదిమితే పాలుగారు పసివాళ్ళు... వీపును వంచి, పెద్దపెద్ద పుస్తకాలున్న సంచీలను మోస్తూ కనిపించారు. దేముడి ఒళ్ళు ఒక్కసారిగా గగుర్పొడిచింది.

మరో దృశ్యం.. పిల్లలు కళ్ళు కాయలుకాచేటట్టు చదువుతూ, చిన్నచిన్న చేతులతో హోంవర్క్ చేస్తున్నారు. గడియారం ముల్లు తిరుగుతూనే వుంది. ఏ అర్ధరాత్రి వరకో, అలా పిల్లలు హోమ్‌వర్క్‌లు చేస్తూనే వున్నారు.

మళ్ళా దృశ్యం మారిపోయింది. ఓచోట ఉపాధ్యాయులు పిల్లలు ఆలస్యంగా వచ్చారని బెత్తంతో కొడుతున్నారు. ఇంకోచోట... పుస్తకాలు తీసుకురాలేదని బెంచీమీద నిలబెట్టారు. ఓ మాస్టారు పిచ్చి కోపంతో బెత్తం విరిగేలా కొట్టాడు. ఆ పిల్లవాడు స్పృహతప్పి పడిపోయాడు.

చిన్నచిన్న దృశ్యాలు చకచకా మారిపోతూ వున్నాయి. ఓ విద్యార్థికి కన్ను పోయింది. మరో విద్యార్థి చేతులు వాలిపోయాయి.

మరో దృశ్యంలో, పిల్లలను వంద.. రెండు వందలు గుంజీలు తీయిస్తున్నారు టీచర్లు. ఓ విద్యార్థి చ..చ్చి..పో..యా..డు..

* * *


''వద్దు... నేనిక చూడ్లేను.. దివ్య చక్షువులూ.. మీరు మూసుకోండి'' దేముడు అరిచాడు.

''చూశారా దేముడూ... చివరి దృశ్యాలు ఈమధ్య జరిగినవే... పిల్లల చేత గుంజీలు తీయించారు. వెనుకటి రోజుల్లో గురుకులాలు వుండేవట కదా దేముడా.... గురువులకు శుశ్రూష చేస్తూ, అడవిలో, ఆశ్రమంలో ఆడుతూ, పాడుతూ విద్యాబుద్ధులు నేర్చుకొనే వాళ్ళట కదా... గురువులు తామే తల్లిదండ్రులై విద్యాబుద్ధులు చెప్పేవాళ్ళట కదా...''

''అవునవును...'' దేముడు అన్నాడు.

''మరి ... ఈ పుస్తకాల బరువు పాపం.. హోమ్‌వర్క్‌ల శాపం... ఉపాధ్యాయుల దండనల నరకం మాకేలా...'' బబ్లూ దీనంగా దేముడ్ని నిలదీశాడు.

''ఈ కలియుగంలో నేను అవతారం ఎత్తి దుష్టశిక్షణ చేయలేను. ప్రత్యక్షంగా కనిపించే శత్రువును





ఎదుర్కోవడానికి అవతారం ఎత్తగలను. ఈ విద్యా విధానం అనే శత్రువు కంటికి కనిపించదు.. నీకేం కావాలో కోరుకో...'' దేముడు అన్నాడు నర్మగర్భంగా!

బబ్లూ తనకేవరం కావాలో చెప్పాడు. దేముడు తథాస్తు అన్నాడు. తథాస్తు దేవతలు దేవుడివైపు చూసి 'చిత్తం' అన్నారు.

***

ఒక్కసారిగా దేముడు 'తథాస్తు' అన్న మాటతో లోకం తీరు మారింది. బబ్లూ దేవుడ్ని కోరిన కోరిక నె..ర..వే..రి..డం ప్రారంభమైంది.

స్కూలుకు వెళ్ళే పిల్లలున్న తల్లిదండ్రులకు వీపులు నొప్పెట్టడం మొదలయ్యాయి. వీపుమీద కిలోలకొద్దీ పుస్తకాలు వున్న ఫీలింగ్...

ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళు, బిజినెస్‌మేన్లు, గృహిణులు... ఒక్కరేమిటి... విద్యార్థుల తల్లిదండ్రులకు తమ వీపుల మీద నొప్పులు మొదలయ్యాయి.

వీపు నొప్పులకు సంబంధించిన సమస్యలతో డాక్టర్ల దగ్గర క్యూ మొదలయింది.

సమస్య అక్కడితో ముగిసిపోలేదు... టీచర్ల చేతులకు నొప్పులు మొదలయ్యాయి. చేతివ్రేళ్ళు వాయడం మొదలైంది. చేతివ్రేళ్ళు పచ్చి పుళ్ళయ్యాయి.. వందలకొద్దీ పేజీల హోమ్‌వర్క్ చేస్తోన్న ఫీలింగ్... ఏ పనీ చేయకుండానే టీచర్లు అలసిపోతున్నారు.

దృశ్యం మారింది... మరోచోట పిల్లలను అతిగా దండించే మాస్టార్ల వీపులు ఆటోమేటిగ్గా చిట్లిపోతున్నాయి. పిల్లల వీపుల మీద బెత్తాలతో దరువేస్తుంటే, ఆ దెబ్బలు తిరిగి టీచర్లకే తగులుతున్నాయి.

పిల్లల చేత గుంజీలు తీయించే ఉపాధ్యాయులకు వాటి తాలూకూ బాధ రిఫ్లెక్ట్ అవుతోంది. తామే గుంజీళ్ళు తీస్తోన్న ఫీలింగ్.

***

అంతా గగ్గోలుమయం.

ఓ విచిత్రమైన దృశ్యం.

రోడ్లమీద తల్లిదండ్రులు తమ పిల్లల పుస్తకాలు వీపుమీద మోస్తూ స్కూలుకు వెళ్తోన్న దృశ్యం.

టీచర్లే అర్ధరాత్రుళ్ళ వరకూ మేలుకొని హోమ్‌వర్క్ చేస్తున్న దృశ్యం.

టీచర్లను విద్యార్థులు బెత్తంతో కొడుతున్న దృశ్యం. గుంజిళ్ళు తీయిస్తున్న దృశ్యం.

అంతా అయోమయం చిందరవందర... గందరగోళం.

***

పేరెంట్స్‌కు తెలిసొస్తుంది తమ పిల్లలు వీపుల మీద ఎంత బరువు మోస్తున్నారో...

ఉపాధ్యాయులకు తెలిసొస్తూంది... తామిచ్చే హోమ్‌వర్క్ పిల్లల లేత చేతివ్రేళ్ళకు ఎంత బాధ కలిగిస్తుందో... వాళ్ళు హాయిగా ఆడుకోవలసిన సమయాన్ని తామెంత హరించి వేస్తున్నామో...

పిల్లలను కొట్టడం ఎంత తప్పో, గుంజీళ్లు తీయించడం ఎంత బాధాకరమో అర్థమవుతూ వుంది రాక్షసంగా ప్రవర్తించే ఉపాధ్యాయులకు!

ప్రభుత్వం కళ్లు తెరిచింది... విషయం అర్థమైంది.

***

'కేజీ' చదువుల్లోనే కేజీలకొద్దీ వున్న పుస్తకాల సిలబస్‌ని తొలగించారు. హోమ్‌వర్క్ పేరుతో విద్యార్థుల్ని హింసించకూడదని హుకుం జారీ చేశారు.

పిచ్చి కారణాలతో పిచ్చెక్కినట్టు విద్యార్థులను ఫినిష్ చేయకూడదని, చేస్తే వాళ్ళ సర్వీస్ ఫినిష్ అయినట్టే అని ఆర్డర్ పాస్ చేయించారు.

***

పిల్లల్లో ఆనందం. ఆడుతూ, పాడుతూ చదువుకోవడం.. పనికొచ్చే చదువులు.. పుస్తకాల మోత లేదు.. హోమ్‌వర్క్‌ల బాధ లేదు. పనిష్‌మెంట్లు లేవు.

బబ్లూ ఎగిరి గంతేశాడు.

***

చిన్నశబ్దం... చిన్న దెబ్బ.. ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు బబ్లూ... తను కిందపడి వున్నాడు. చేయాల్సిన హోమ్‌వర్క్ బండెడు వుంది... టేబుల్ మీద దినపత్రిక. ''విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో శిక్షిస్తోన్న ఉపాధ్యాయులు...'' అన్న వార్త.

వీళ్ళకు ఎప్పుడు బుద్ధొస్తుంది?

''దేముడా... వీళ్ళ బుద్ధుల్ని మార్చు... నా కలను నిజంచేయ్...'' బబ్లూ మనస్ఫూర్తిగా దేముడ్ని వేడుకున్నాడు. స్వార్థంలేని అతని కోరికను దేముడు ఆలకిస్తాడు... ఆ...ల...కి...స్తు...న్నా...డు...

★

## ఎంతో నేర్చుకున్నాను

అమ్మాయిల కలల రాకుమారుడు హృతిక్‌రోషన్‌కు భార్య సుసన్నే అంటే చాలా ప్రేమ, గౌరవం. తండ్రి రాకేష్‌రోషన్ ఆయనకు మార్గదర్శకుడు. హృతిక్ చాలా మృదుస్వభావి. ఆయన మాటల్లో ఎంతో పరిపక్వత కనిపిస్తుంది. ''జీవితం నాకెంతో నేర్పింది. మా నాన్న ఎప్పుడూ అనేవాడు.. సక్సెస్‌ని తట్టుకోవడం చాలా కష్టమని. విజయమంటే పెద్ద భ్రాంతి, ఆ భ్రాంతికి గురైతే మనంతటి వాడు లేడనే భావన ఆవరిస్తుంది. సక్సెస్ మాయమైన తరువాత డిప్రెషన్‌లోకి వెళ్లిపోయి, తరువాత ఇంకెప్పుడూ విజయం సాధించలేం. ఈ మాటలు నాకు బాగా గుర్తుండడం వల్లే 'కహోనా ప్యార్ హై' తరువాత అన్ని అపజయాలను తట్టుకుని నిలబడగలిగాను. ఇక నేనూ సుసన్నే ఎప్పుడూ గొడవపడం. ఇద్దరం సినిమా కుటుంబాలనుంచే వచ్చాం. ఈ ఫీల్డ్‌లో వున్న పుకార్ల గురించి మాకు బాగా తెలుసు'' అంటాడు హృతిక్.